సాక్షి నిర్మల్

గురువారం । 7 । నవంబర్ । 2024

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మహేందర్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అమీర్ ఖుస్రో, పీడీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

అంధకారంలో భైంసా పట్టణం..!

భైంసాటౌన్: భైంసా పట్టణంలో బుధవారం సాయంత్రం అంధకారం నెలకొంది. స్థానిక సబ్‌స్టేషన్‌లో సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఆయిల్ బయటికి రావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దుకాణదారులు, ప్రజలు చీకటిలో ఇబ్బంది పడ్డారు. డీఈఈ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టేందుకు తీవ్రంగా శ్రమించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 / 19.0

జిల్లాలో ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి తీవ్రత పెరుగుతుంది. వేకువ జామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అంబవాయి కుంటను పరిశీలించిన అదనపు కలెక్టర్



కుంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామంలో ఉన్న అంబవాయి కుంటను బుధవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పరిశీలించారు. తమ జీవనాధారమైన కుంటను ఆక్రమణపై సోమవారం గంగపుత్రులు ఫిర్యాదు చేశారు. స్పందించిన అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో కుంటను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన గంగపుత్రులు తమ కుంట నానాటికీ విస్తీర్ణం కోల్పోతుందంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదంటూ ఆవేదనను వ్యక్తం చేశారు. తక్షణమే రికార్డులు పరిశీలించి సర్వే చేయించాలంటూ తహసీల్దార్ స్వాతిని ఆదేశించారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

తానూరు: ఉపాధిహామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీలో పశువుల షెడ్లు, నాడేపు కంపోస్టు, కోళ్ల పెంపకం పథకాలను రైతుల దృష్టికి తీసుకువెళ్లి నిర్మించేలా చూడాలన్నారు. అనంతరం తానూరు గ్రామానికి చెందిన బద్రె సాయినాథ్ సాగు చేసిన జామతోటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం, వేములవాడకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కాళేశ్వరం, వేములవాడకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఉదయం 5 గంటలకు నిర్మల్ బస్టాండ్ నుంచి బయలుదేరి ఉదయం 10:15 నిమిషాలకు కాళేశ్వరం చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు నిర్మల్ చేరుకుంటుందన్నారు. దీంతోపాటు ప్రతీ శని, ఆది, సోమవారాల్లో వేములవాడకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. కాళేశ్వరానికి అప్ అండ్ డౌన్ ఒకరికి రూ.1,200 అవుతుందని, వేములవాడకు పెద్దలకు రూ.260, పిల్లలకు రూ.140 బస్సుచార్జీ అవుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కల్లుగీత వృత్తి రక్షణకు ఉద్యమించాలి'



మాట్లాడుతున్న నర్సాగౌడ్

నిర్మల్‌టౌన్: కల్లుగీత వృత్తి రక్షణకు గౌడ కులస్తులు రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జిల్లా 4వ మహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ పేరు నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ళ రాజేందర్‌గౌడ్, జాతీయ జనరల్ సెక్రెటరీ సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజుగౌడ్, రాష్ట్ర కార్యదర్శి లింగాగౌడ్, అధికార ప్రతినిధి నారాయణగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

నిర్మల్‌టౌన్: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి రాధిక అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫుడ్ పాయిజన్.. బాధ్యులెవరు!?

మయోనైజ్.. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్‌పాయిజన్ ఘటనలకు ఇదే కారణం. తాజాగా నిర్మల్‌లోని గ్రిల్ 9 హోటల్‌లో ఫుడ్‌పాయిజన్ కారణంగా ఒక యువతి మృతి చెందడంతో పాటు దాదాపు 50 మంది వరకు అస్వస్థతకు గురికావడానికి ఇదే కారణంగా తేలుతోంది. అసలు విషయం ఏంటంటే.. ఈ మయోనైజ్‌ను రాష్ట్రప్రభుత్వం అక్టోబర్ 30నే నిషేధించింది. ఏడాదిపాటు దీన్ని ఎక్కడా వినియోగించవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ.. జిల్లాలో ఏమాత్రం నిషేధాన్ని పట్టించుకోకుండా అన్ని హోటళ్లలో తందూరి చికెన్, షవర్మా, చికెన్-65ఇలా.. ప్రతీ దానికి మయోనైజ్‌ను అందించడం గమనార్హం. నిషేధం విషయంలో సీరియస్‌గా తీసుకోకపోవడం, సంబంధిత అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఓ నిండుప్రాణం పోయిందన్న ఆరోపణలు వస్తున్నాయి.



తందూరి చికెన్‌తో నిషేధిత మయోనైజ్

- హోటళ్లలో నిషేధిత మయోనైజ్ వాడకం
- జిల్లాలో ఘటనకు అదే కారణం
- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- ఇప్పటికీ పలువురు సీరియస్
- పర్యవేక్షణ లోపమే.. శాపమా..!?

నిర్మల్: జిల్లాలో చాలా శాఖల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలోనూ పలు శాఖల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోని గ్రిల్ 9 రెస్టారెంట్‌లో ఈనెల 2, 3 తేదీల్లో తిన్నవారు తీవ్రఅస్వస్థతకు గురికాగా మధ్యప్రదేశ్‌కు చెందిన యువతి ఫూల్‌కాలీబైగా మృతి చెందిన విషయం తెలిసిందే. దాదాపు 50 మంది వరకు అస్వస్థతకు గురికాగా ఇప్పటికీ ఇద్దరు ముగ్గురి పరిస్థితి సీరియస్‌గానే ఉంది. ఈ ఘటన జరిగి రెండురోజులు దాటినా ఇప్పటికీ హోటల్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఇష్టారీతిన హోటల్ దందాలు..

జిల్లా వ్యాప్తంగా హోటల్, రెస్టారెంట్, దాబాల నిర్వహణ ఇష్టారీతిన సాగుతోంది. అడిగేవారు లేకపోవడంతో వారు వడ్డించిందే ఆహారమన్నట్లుగా నడుస్తోంది. నాణ్యతలేని వంటనూనెలు, డాల్డాలు, కల్తీ నెయ్యి, నూడుల్స్ వినియోగిస్తున్నారు. మంచూరియా తయారీలో ఫుడ్‌కలర్స్ ఎక్కువగా వేసి, కుళ్లిన గోబీతో తయారు చేస్తున్నారు. ఇక మాంసాహారం విషయంలోనైతే దారుణం. నిల్వఉంచిన చికెన్, మటన్, చేపలను పెడుతున్నారు. కుళ్లిన వాటినే మళ్లీ కడిగి వండి వడ్డిస్తున్నారు. ప్రధాన రోడ్లపై ఉండే దాబాలలోనూ రోజుల తరబడి చికెన్, మటన్‌లను ఫ్రిజ్‌లలో ఉంచుతూ వాటినే వండిస్తున్నారు. వండిన పాత్రలను శుభ్రం చేయకుండా అలాగే రోజుల తరబడి వాడుతుండటం మరీ దారుణం.

ఫుడ్'సేఫ్టీ'.. ఎక్కడా..!?

ప్రజారోగ్య పరిరక్షణలో ఫుడ్‌సేఫ్టీ శాఖ చాలా కీలకం. కానీ.. జిల్లాలో ఈ శాఖ తీరు ఎప్పుడూ అనుమానాస్పదంగానే ఉంటోంది. ఒకప్పుడు నాలుగైదు జిల్లాలకు కలిపి ఓ అధికారి ఉండేవారు. కొన్నేళ్లుగా జిల్లాకో ఫుడ్‌సేఫ్టీ అధికారిని నియమించారు. కానీ.. ఎప్పుడు ఏ అధికారి ఉంటారో తెలియదు. చాలా సందర్భాల్లో వ్యాపారులు చెప్పినట్లు అధికారులు నడుచుకుంటారన్న ఆరోపణలూ ఉన్నాయి. తాజాగా మయోనైజ్‌ను రాష్ట్రప్రభుత్వం నిషేధించి వారం గడుస్తున్నా.. ఇప్పటికీ జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగిస్తూనే ఉన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణలోపం కారణంగానే ఇలాంటివి జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఆ శాఖలు ఏం చేస్తున్నాయి..!?

హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల ఏర్పాటుకు పర్మిషన్ ఇచ్చేముందు అవి నిబంధనల ప్రకారం ఉన్నాయా.. లేవా.. అని పరిశీలిస్తున్న దాఖలాలు లేవు.

- మున్సిపాలిటీల్లో అధికారులు దాదాపు ఐదేళ్లలో ఒక్కసారి కూడా తనిఖీలు చేసిన సందర్భాలు లేవు. అప్పుడెప్పుడో మున్సిపల్ కమిషనరే బాధితుడు కావడంతో శ్రీలక్ష్మి గ్రాండ్ అనే హోటల్‌ను సీజ్ చేశారు. ఆ తర్వాత ఇప్పటికీ ఆ శాఖ వీటి వైపు చూడటం లేదు. ఇక రోడ్లపై పెట్టి పానీపూరి, బజ్జీమిర్చి, ఫాస్ట్‌ఫుడ్, చేపఫ్రై విక్రయించే వాటిపై అసలే పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మూడు మున్సిపాలిటీల్లో సంబంధిత అధికారులు 'మామూలు'గానే తీసుకుంటారని, ఏదైనా ఘటన జరిగితే తూతూమంత్రంగా స్పందిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి.
- మయోనైజ్‌పై నిషేధం అమలు చేయించింది వైద్యారోగ్యశాఖ. కానీ.. జిల్లాలో ఆ శాఖ తమకేం సంబంధం అన్నట్లుగా తమాషా చూస్తోంది. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన సదరు అధికారులు తమ ఆస్పత్రుల్లోకి వస్తేనే పరిశీలిస్తామన్న తరహాలో ఉన్నారు. సదరుశాఖ మయోనైజ్ వినియోగాన్ని నిషేధించిన విషయాన్ని కూడా కనీసం ప్రచారం చేసిన దాఖలాలు లేవు.

వీలైనంత వరకు తినొద్దు..

ఫుడ్‌పాయిజన్ ఘటనలో నిషేధిత మయోనైజ్ తిన్నవారే ఎక్కువమంది బాధితులు ఉన్నారు. త్వరగా బాక్టీరియా చేరడానికి అవకాశం ఉండే ఇలాంటి పదార్థాలను వీలైనంత వరకు తినొద్దు. బయట ఫుడ్ తిన్నతర్వాత ఏమాత్రం వాంతులు, వీరేచనాలైనా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ శశికాంత్, నిర్మల్

చర్యలు తీసుకోవాలి..

ఫుడ్‌పాయిజన్ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించకపోవడం దారుణం. ఇలాంటివి జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో చాలా హోటళ్లలో ఏమాత్రం శుభ్రత, నాణ్యత ఉండటం లేదు. వీటిపై వెంటనే స్పందించాలి.

– పూదరి శివకుమార్, నిర్మల్

గ్రూప్-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 17, 18 తేదీలలో జరగనున్న గ్రూప్-3 పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రంలో 24 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8,124 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, ఆయా రూట్లలో సరిపడా ప్రత్యేక బస్సులు నడపాలని, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, పరీక్షల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి గంగారెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై పర్యవేక్షణ ఉండాలి

నిర్మల్‌చైన్‌గేట్: హైరిస్క్ గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో గర్భస్థ మరణాలపై వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే మహిళలకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి హైరిస్క్ గర్భిణులను గుర్తించి అవసరమైన మందులు అందించాలన్నారు. వారిపై నిరంతర పర్యవేక్షణ ఉంచి, అవసరమైన వైద్యచికిత్సలు అందించాలన్నారు. వైద్యాధికారుల సమన్వయ సహకారంతో జిల్లాలో గర్భస్థ మరణాలను నియంత్రించాలన్నారు. ప్రతీ గర్భిణికి ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతను వివరించాలన్నారు. రక్తహీనత నివారణ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యాధికారులు శ్రీనివాస్, సురేష్, సౌమ్య, సరోజ, నయన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పిప్రి' చివరి ఆయకట్టుకు సాగునీరు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: పిప్రి ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయకట్టుకూ సాగునీరు అందిస్తామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఇటీవల రూ.19 కోట్ల నిధులు మంజూరుకాగా బుధవారం పథకం అదనపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు పూర్తయితే మండలంలోని పిప్రి, రాయాపూర్ కాండ్లీ, లోకేశ్వరం, నగర్, ధర్మోర, గొడిసెరా, బాగాపూర్, మొహళ, తదితర గ్రామాల్లోని 4,200 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అనంతరం గడ్చాందలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, నాయకులు రవీందర్ రావు, శ్రీధర్, చిన్నారావు, విలాస్, భాస్కర్, సాయన్న, బద్దం గంగారెడ్డి, పృథ్వీ, శంకర్‌గౌడ్, రమేశ్, ఆనంద్‌రావు, గంజాల గంగాధర్, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

పులి రక్షణకు గాలింపు చర్యలు



గాలిస్తున్న మహారాష్ట్ర, తెలంగాణ అధికారులు



సరిహద్దు ప్రాంతంలో గుర్తించిన పులి పాదముద్ర

కుంటాల: మండలంలోని సూర్యాపూర్-దొనెల్లి అటవీ ప్రాంతంలోని హన్మంత్ మోరె వద్ద మహారాష్ట్ర అప్పారావుపేట్ రేంజ్, తెలంగాణ అటవీ అధికారులు పులి రక్షణకు గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకాలోని అప్పారావుపేట రేంజ్ పంగర్ పాడ్ ప్రాంతంలో 100 మీటర్ల దూరంలోనే బెబ్బులి ఉన్నట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో వేణుగోపాల్, డీఆర్‌వో రేష్మ, అప్పారావుపేట్ రేంజ్ అధికారులు రఘునాథ్, కృష్ణ, ఎఫ్ఎస్‌వో కీర్తిరెడ్డి, ఎఫ్‌బీవో హరిలత, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు సహకరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్/మామడ: ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ కోరారు. మామడ మండలం న్యూసాంగ్విలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును బుధవారం తనిఖీ చేశారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటింటి సర్వే కోసం ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించబడకుండా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బ్లాక్‌కు ఒకరు చొప్పున ఎన్యూమరేటర్లను నియమించామని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాల్సిన తీరుపై వారికి శిక్షణ ఇచ్చామన్నారు. సర్వేలో భాగంగా ఈ నెల 6, 7, 8, తేదీలలో హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, 9 నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందన్నారు. సర్వే బృందానికి నిర్ణీత సమాచారం అందించి సహకరించాలన్నారు.



న్యూసాంగ్విలో సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

కుంటాల: సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని మెదన్ పూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. జిల్లాలో 2,39,784 గృహాలకు గానూ సర్వే కోసం 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించినట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠం చెబుతూ సందేహాలు నివృత్తి చేశారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, పీఆర్ డీఈ రాజేందర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఇథనాల్'ను నిరసిస్తూ మహిళల ర్యాలీ



గుండంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

దిలావర్‌పూర్: ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలంటూ గుండంపల్లిలో బుధవారం రాత్రి పలు వార్డులకు చెందిన మహిళా రైతులు, బీడీ కార్మికులు, మహిళా కూలీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రతిఒక్కరూ తరలిరావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గుండంపల్లి గ్రామానికి చెందిన మహిళలు, ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఎల్లాల చిన్నారెడ్డి, భోజారెడ్డి, సుభాష్‌రెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధులు భారం.. నిధులు దూరం

- ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- కొలువులో కొనసాగుతూనే ఇతర ఉద్యోగాల కోసం ప్రయత్నాలు
- జిల్లాలో క్రమంగా ఖాళీ అవుతున్న జీపీ కార్యదర్శి పోస్టులు
- ఐదేళ్లలో 83 మంది ఇతర ఉద్యోగాల వైపు..



జైరాంతాండ గ్రామ పంచాయతీ కార్యాలయం

2019 ఆగస్టులో జరిగిన నియామకాల ప్రకారం వివరాలు

ఖాళీలు	322
ఇంటర్వ్యూకు హాజరైనవారు	314
తిరస్కరించబడిన వారు	11
ఆర్డర్ కాపీలు పొందినవారు	303
విధుల్లో చేరిన వారు	289
విధుల్లో చేరని వారు	14

నిర్మల్‌చైన్‌గేట్: ఒక గ్రామ పంచాయతీకి అధికారిగా.. వందలాది మంది ప్రజలకు సేవచేసే అవకాశం, గ్రామ రూపురేఖలు మార్చగలిగే గురుతర బాధ్యతలు పంచాయతీ కార్యదర్శికి మాత్రమే ఉంటాయి. ఇందులో భాగంగానే అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టిన సెక్రెటరీలు నిధులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కార్యదర్శి కంటే తక్కువ స్కేల్ ఉద్యోగమైనా ఫర్వాలేదన్నట్లుగా ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారిస్తున్నారు.

ఐదేళ్లలో 83 మంది..

జిల్లాలో నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం కార్యదర్శుల పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. 2019లో జిల్లాలో 289 మంది విధుల్లో చేరగా ఒత్తిడి పెరుగుతుండడంతో ప్రత్యామ్నాయ ఉద్యోగాలపై దృష్టి సారించారు. వేతనం, హోదా తక్కువైనా సరే చేరేందుకు సిద్ధమయ్యారు. ఇలా ఐదేళ్లలో 83 మంది కార్యదర్శులు కొలువులకు దూరమయ్యారు. ప్రారంభంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ పోస్టులు, ఆ తర్వాత గ్రూప్-4, ఏఎస్‌వో, స్టాఫ్ సెలక్షన్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్, గురుకుల ఉద్యోగాల్లో చేరారు. తాజా డీఎస్సీలోనూ ముగ్గురు కార్యదర్శులు ఉపాధ్యాయ కొలువులు దక్కించుకున్నారు. ఇలా గత ఐదేళ్లలో 30 శాతం మంది ఇతర విధుల్లో చేరారు.

నిధుల లేమి కూడా సమస్యే..

గ్రామ పంచాయతీల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2019 నుంచి క్రమం తప్పకుండా నిధులు మంజూరు చేశాయి. ఆయా నిధులతో పంచాయతీలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇలా మూడేళ్లు గడిచేసరికి నిధుల విడుదలలో జాప్యం ప్రారంభమైంది. దీంతో అత్యధిక పంచాయతీలలో ప్రజాప్రతినిధులు తమ సొంత నిధులు పెట్టుబడిగా పెట్టి పాలన సాగించారు. కొన్నిచోట్ల కార్యదర్శులకు సైతం ఆ బాధ్యత తప్పలేదు. ప్రస్తుతం పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో కార్యదర్శులే ఖర్చులన్నీ భరించాల్సి వస్తోంది. ఈ బిల్లులు సకాలంలో అందక అప్పుల పాలవుతున్నారు. ఇక గత అలవాట్లకు అనుగుణంగా నిధుల కోసం కార్యదర్శులపై పలు రూపాల్లో ఒత్తిడులు ప్రారంభమయ్యాయి. నిధులు విదల్చకుంటే మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ సమయంలో అండగా నిలవాల్సిన క్షేత్రస్థాయి అధికారులు పలాయనం చిత్తగించడంతో కార్యదర్శులు మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు కార్యదర్శులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ ఉన్నాయి. మరికొందరు సెలవు పెట్టి ఇళ్లకే పరిమితం అవుతున్నారు.

పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు..

పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం 500 జనాభా ఉన్న తండాలను, గూడేలను పంచాయతీలుగా మార్చింది. ఇలా జిల్లాలో పాత, కొత్తవి కలిపి 396 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ప్రతీ పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించారు. వారు తమ చెప్పు చేతల్లో ఉండాలంటూ రాజకీయ నాయకులు ప్రయత్నించడం, గ్రామస్తుల ముందే వారిని చిన్నచూపు చూడడం, తమ మాట వినడం లేదంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం వంటి వేధింపులు పెరిగాయి. ఇది కార్యదర్శులందరికీ వర్తించకపోయినా జిల్లాలో అనేక మంది ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ప్రస్తుతం 13 పోస్టులు ఖాళీ అయ్యాయి.

'ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం'

కడెం: ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే, ఆయిల్‌పాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయిల్‌పాం సాగులో అడవి పందుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాట్లు, తదితర సమస్యల గురించి వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

గిరిజనుల సంక్షేమానికి చర్యలు



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్‌: ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, వైద్యం, ఉపాధి కోసం, యువత మానసిక వికాసం కోసం శ్వేషోధన్, ధర్మసేవ సంస్థలతో కలిసి ముందుకు వెళ్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ఐటీడీఏ పీవో చాంబర్‌లో హైదరాబాద్‌లోని శ్వేషోధన్, ధర్మసేవ సంస్థల ప్రతినిధులు డాక్టర్ పులపల్లి కరుణాకర్‌రెడ్డి, జె.నిషాంత్‌రెడ్డిలతో సమావేశమయ్యారు. ఈ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలపై పీవో ఖుష్బూ గుప్తా చర్చలు జరిపారు. భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సల్లా అనిల్, స్రవంతి, డాక్టర్ సంపత్, నిషాంత్, వెంకట్, రాధిక, భార్గవ్‌లు పాల్గొన్నారు.

డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులో వినూత్న తీర్పు

మంచిర్యాలక్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై విచారణ అనంతరం మొదటి అదనపు సివిల్ జడ్జి ఉపనిషద్వని వినూత్న తీర్పునిచ్చారు. స్థానిక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు ఇటీవల కాలంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. కాగా విచారణ అనంతరం బుధవారం 27మందికి స్థానిక మొదటి అదనపు సివిల్ జడ్జి ఉపనిషద్వని జైలు శిక్షకు బదులుగా జిల్లా కేంద్రం కాలేజీరోడ్‌లోని మాత శిశు కేంద్రం ఆసుపత్రిలో వారం రోజుల పాటు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పారిశుద్ధ్యం పనులు చేయవల్సిందిగా తీర్పునిచ్చారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాజ్‌కుమార్

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జి ల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాజ్‌కుమార్ అనే విద్యార్థి ఈనెల 5న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 విభాగంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. దీంతో రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో ఆడటానికి అర్హత సాధించాడు. ఈనెల 7వ తేదీ నుంచి యదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా జట్టు తరఫున రాజ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. సదరు విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

VEHICLES FOR SALE

■ On Where Conditions Vehicles for Sale - ASHOK LEYLAND 1815 HE BSVI- 2022- TS20T8610 IndusInd Bank Ltd., Mancherial Branch. Contact No. 7338879680 [K-1253260]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253908]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ18k Ph: 9160900024, 9640400073 [SCA-24000547]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

సింగరేణి సత్తా చాటుతాం

- ఫుట్‌బాల్ క్రీడాకారుల ఆశాభావం
- కోలిండియా పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు



సింగరేణిస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: వచ్చే నెలలో ధన్‌బాద్‌లో నిర్వహించే కోలిండియా ఫుట్‌బాల్ పోటీల్లో సింగరేణి సత్తా చాటుతామని కంపెనీస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో బుధవారం ముగిశాయి. పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విన్నర్‌గా, ఆర్జీ -1, ఆర్జీ -2 ఏరియా జట్లు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా డబ్ల్యూపీఎస్‌అండ్‌జీఏ సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేయనుంది. కాగా సింగరేణిలో గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు. కోలిండియా స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా టర్ఫ్, గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టులు ఉంటాయని, సింగరేణి స్థాయిలో అలాంటి కోర్టులు లేకపోవడంతో కోలిండియా స్థాయి పోటీల్లో ఆడడం సింగరేణిస్థాయి క్రీడాకారులకు ఇబ్బంది ఉంటుందని పేర్కొంటున్నారు. క్రీడాకారుల ఇబ్బందులను యాజమాన్యం గుర్తించి సింగరేణి స్థాయిలో ఒక గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేయాలని, కోలిండియా పోటీలకు వెళ్లే ముందు క్రీడాకారులకు కనీసం నెల రోజులైనా ప్రత్యేక కోచ్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించాలని సీనియర్ క్రీడాకారులు సూచిస్తున్నారు.



విన్నర్ షీల్డ్ అందుకుంటున్న శ్రీరాంపూర్ జట్టు

ముగిసిన కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీలు



రన్నర్ షీల్డ్ అందుకుంటున్న ఆర్జీ -1, ఆర్జీ -2 ఏరియా జట్టు

మందమర్రిరూరల్: కంపెనీ లెవెల్ ఫుట్‌బాల్ పోటీల్లో బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయం సాధించింది. రన్నరప్‌గా ఆర్జీ -1, ఆర్జీ -2 జట్టు నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ ట్రోఫీలు అందజేశారు. ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, ఏరియా కోఆర్డినేటర్ శివకృష్ణ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్స్ అశోక్, రమేశ్, జాన్ వెస్లీ, టీం మేనేజర్స్, క్రీడాకారులు ఉన్నారు.

27సార్లు కోలిండియా పోటీల్లో పాల్గొన్నా..



నేను 1995వ సంవత్సరంలో ఉద్యోగంలో చేరాను. ఫుట్‌బాల్‌పై ఉన్న మక్కువతో విద్యార్థి దశ నుంచే ఆటలో మెలకువలు నేర్చుకున్నాను. సింగరేణిలో పోటీల్లో పాల్గొని సత్తాచాటి కంపెనీ లెవల్ స్థాయికి ఎదిగాను. ఇప్పటివరకు 27సార్లు కోలిండియా, ఒక్కసారి పబ్లిక్ సెక్టార్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను.

– సామల సత్యనారాయణ, జనరల్ మజ్దూర్, ఆర్జీ -1 ఏరియా

కోలిండియా పోటీల్లో సత్తా చాటుతా..



సింగరేణిలో 2015వ సంవత్సరంలో ఉద్యోగంలో చేరాను. ఇప్పటి వరకు 12సార్లు కోలిండియా, ఒక్కసారి పబ్లిక్ సెక్టార్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. సింగరేణి సంస్థ క్రీడాకారులకు అందించే ప్రోత్సాహంతో వచ్చే నెలలో జరుగబోయే కోలిండియా పోటీల్లో పాల్గొని సత్తా చాటుతాను.

– బెల్లం తిరుపతి, శ్రీరాంపూర్ ఓసీ, జనరల్ మజ్దూర్

సింగరేణి ప్రోత్సాహం బాగుంది..



సింగరేణి సంస్థ క్రీడాకారులకు అందించే ప్రోత్సాహం బాగుంది. సింగరేణిలో 1998లో ఉద్యోగంలో చేరి ఫుట్‌బాల్ క్రీడలో నైపుణ్యం సాధించాను. ఇప్పటి వరకు నాలుగుసార్లు కోలిండియా పోటీల్లో పాల్గొన్నాను. వచ్చే నెలలో జరిగే కోలిండియా పోటీల్లో పాల్గొని సింగరేణి యువ క్రీడాకారులతో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తాం.

– బొంగోని చిన్నన్న, ఎస్టీపీపీ ఎస్‌అండ్‌పీసీ విభాగం

సంస్థకు గుర్తింపు తీసుకురావాలి



సింగరేణిలో నైపుణ్యం కలిగిన మంచి క్రీడాకారులు ఉన్నారు. వచ్చే నెలలో ధన్‌బాద్‌లో నిర్వహించే కోలిండియా ఫుట్‌బాల్ పోటీలకు యాజమాన్యం సిద్ధంగా ఉంది. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని సింగరేణి సత్తాచాటి సంస్థకు గుర్తింపు తీసుకురావాలి.

– చట్ల అశోక్, డబ్ల్యూపీఎస్‌అండ్‌జీఏ, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సెక్రెటరీ

జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

దండేపల్లి: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో దండేపల్లి మండలం తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్14 బాలబాలికల విభాగం జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంఈవో చిన్నయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు విద్యార్థులకు శారీరకంగా ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయన్నారు. పోటీల్లో 26 బాలుర జట్లు, 12 బాలికల జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఫణిరాజా, పాఠశాల హెచ్‌ఎం సుదర్శన్, మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీశ్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



గేడం శ్రీనివాస్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని పిట్టబొంగరం గ్రామపంచాయతీ పరిధి పాటగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. పాటగూడ గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్(25) గత సంవత్సరం కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరు నెలల క్రితం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించారు. కొంత ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. అయితే గత నెల రోజులుగా మళ్లీ మతిస్థిమితం కోల్పోయి ఎవరితోనూ మాట్లాడకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గ్రామానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కోసుబాయి ఉన్నారు.

దుబాయ్‌లో తెలంగాణవాసి ఆత్మహత్య



సాయిరాం(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌పేట్ గ్రామానికి చెందిన బామండ్ల నర్సు -సాయన్నల కుమారుడు సాయిరాం(24) దుబాయ్‌లో పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం సోదరి వివాహానికి వచ్చి తిరిగి వెళ్లాడు. కాగా మంగళవారం బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు అక్కడున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. త్వరగా మృతదేహాన్ని ఇండియాకు చేర్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు, గల్ఫ్ సంఘాల నాయకులు కృషి చేయాలని కోరుతున్నారు.

చెరువులో పడి కార్మికుడి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి సింగరేణి కార్మికుడు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ 24 డీప్ ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడు పులి రాజ్‌కుమార్(52) బెల్లంపల్లి పోచమ్మ చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం రాజ్‌కుమార్ తన స్నేహితుడి తమ్ముడి ఐదు రోజుల కర్మ కార్యక్రమానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా అతని ఆచూకీ లభించలేదు. బుధవారం పోచమ్మ చెరువులో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. స్నానం చేయడానికి చెరువులో దిగగా జారిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాదాస్పదంగా మారిన తోళ్లపరిశ్రమ భూమి



ఎమ్మెల్యే వివేక్‌కు రికార్డులు చూపిస్తున్న సింగరేణి అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో 20 ఏళ్ల క్రితం సింగరేణి సంస్థ ప్రభుత్వం ద్వారా తోళ్ల పరిశ్రమకు కేటాయించిన 25 ఎకరాల భూమి వివాదాస్పదంగా మారింది. పరిశ్రమ మధ్యలో నుంచి సింగరేణి అధికారుల ప్రోద్బలంతో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయడంతో తోళ్ల పరిశ్రమ సాధన సమితి, మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో పలు ఆందోళనలు చేయడంతో పాటు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు విన్నవించుకున్నారు. కాగా బుధవారం ఎమ్మెల్యే వివేక్ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా పలు వార్డులను సందర్శించి, తోళ్ల పరిశ్రమ వద్దకు వచ్చారు. సింగరేణి అధికారులతో పాటు తోళ్ల పరిశ్రమ సాధన సమితి, మాదిగ హక్కుల దండోరా నాయకులతో మాట్లాడారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌కు తోళ్ల పరిశ్రమ భూమి విషయంలో జాయింట్ సర్వే నిర్వహించాలని, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.20 లక్షలు కేటాయించాలని సూచించారు. జాయింట్ సర్వే అయ్యేంత వరకు సింగరేణి అధికారులు అటువైపు వెళ్లకూడదని ఆదేశించారు. ఆయన వెంట సింగరేణి ఏరియా అధికారులు, తోళ్ల పరిశ్రమ సాధన సమితి సభ్యులు, మాదిగ హక్కుల దండోరా నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అమ్మవారి ప్రసాదం అందజేత

బాసర: ట్రిపుల్‌ఐటీ కళాశాలలో వీసీ గోవర్ధన్‌కు ఆలయ కార్యనిర్వాణాధికారి విజయరామారావు, బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్, పూజారి, వేద పండితులు నవీన్ శర్మ బుధవారం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాలలో విద్యార్థులతో పాటు పాల్గొనాలని ఆహ్వానించారు.

లక్సెట్టిపేట రేంజ్ దాటుతున్న పెద్దపులి?

కాసిపేట: కాసిపేట మండలం ముత్యంపల్లి సెక్షన్, లక్షెట్టిపేట రేంజ్ మేడారం సెక్షన్‌లలో సంచరించిన పెద్దపులి బొక్కలగుట్ట, మంచిర్యాల, హాజీపూర్ మండలం అటవీప్రాంతం దాటుతూ రేంజ్ పరిధిలోని టీకానపల్లి వైపు వెళ్లినట్లు అటవీ అధికారులు తెలిపారు. లక్సెట్టిపేట రేంజ్ అధికారి సుభాష్ మాట్లాడుతూ పెద్దపులి టీకానపల్లి ప్రాంతం వరకు వెళ్లినట్లు గుర్తించామన్నారు. తరువాత మళ్లీ గుట్ట దాటి ఎటు వెళ్తుందో గుర్తించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు పాదముద్రల ఆధారంగా పులి కదలికలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ట్రాప్ కెమెరాల్లో పులి చిక్కలేదన్నారు.

డబ్బు కాజేసిన సైబర్ నేరగాళ్లు

నస్పూర్: సైబర్ మోసంలో నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్‌తో పాటు తన బంధువులు, స్నేహితులు రూ. 1,57,319లను పోగొట్టుకున్నట్లు సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత సెప్టెంబర్20న సైబర్ నేరగాళ్లు శివకుమార్ ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో అడ్వర్టైజ్‌మెంట్ లింక్‌ను పంపించారు. లింక్ ఓపెన్ చేయగానే టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అను గుర్తు తెలియని వ్యక్తి ప్రొఫైల్‌తో పాటు మరి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్ ఓపెన్ ఆయ్యాయి. ఈక్రమంలో గ్రూప్ వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపారు. దీంతో పలు దఫాలుగా శివకుమార్‌తో పాటు ఆయన బంధువులు రూ.1,57,319 ఫోన్‌పే ద్వారా పంపించారు. తర్వాత వారి ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'క్రిప్టో' పేరుతో సైబర్ మోసం

నస్పూర్: సైబర్ నేరగాళ్ల మోసానికి నస్పూర్ మండలం సీతారామపల్లి గ్రామానికి చెందిన బొల్లం భీమయ్య రూ. 67వేలు కోల్పోయినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల అక్టోబర్ 10న ఇన్‌స్టాగామ్ యాప్‌లో క్రిప్టో అనే పేజ్ అడ్వర్టైజ్‌లో రూ.10వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని సైబర్ నేరాగాళ్లు ఆశ చూపారు. ఈక్రమంలో భీమయ్య గుర్తు తెలియని వ్యక్తి పంపిన అకౌంట్‌కు పలు దఫాలుగా రూ.67వేలు పంపించాడు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడం.. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం నంబర్ 1930కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాడి అకౌంట్‌లోని రూ. 32వేలు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ప్రతిభగల క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా నెలవు

- ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు
- ఉత్సాహంగా జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు



రెజ్లింగ్ పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతిభగల క్రీడాకారులకు నెలవని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి ఖోఖో, రెజ్లింగ్, రగ్బీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 3వ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా స్టేట్‌మీట్ పోటీల్లో విజేతలుగా నిలిచేందుకు శ్రమించాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని పేర్కొన్నారు. అండర్ 17 ఖోఖో బాలికల జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 8 నుంచి ఖమ్మం జిల్లాలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాష్ట్రపాల్ మాట్లాడుతూ జిల్లాలో అండర్ 17 బాలబాలికల పోటీలు నిర్వహించామన్నారు. ఈ జోనల్ స్థాయి పోటీల్లో ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా జట్లు పోటీ పడ్డాయని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలో జరిగే పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ్దేవ్ మాట్లాడుతూ జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హైదరాబాద్‌లో జరిగే స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జైనథ్ జెడ్పీఎస్‌ఎస్ హెచ్‌ఎం లస్మన్న, సీనియర్ పీడీ రామ్మోహన్, దయానంద్ రెడ్డి, హరిచరణ్ తదితరులు ఉన్నారు.

9న ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ జిల్లాల క్రికెట్ ఎంపిక పోటీలను ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ అంకయ్య, ఆర్గనైజర్ పీడీ నూనె శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర) పాఠశాలలో శనివారం ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీలకు క్రీడాకారులు యూనివర్సిటీకి చెల్లించిన అప్లికేషన్ రశీదు, ఐడి కార్డ్, ఆధార్ కార్డ్, ఎంట్రీ ప్రొఫార్మాతో పాటు 2 ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 94415 50877, 70364 46695 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన చదరంగం పోటీలు



గెలుపొందిన బహుమతులతో విద్యార్థులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని బురదగూడెంలో గల లిటిల్‌ఫ్లవర్ హై స్కూల్‌లో రెండు రోజులు జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ అండర్ 14, 17 విద్యార్థుల చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి బహుమతులు అందజేశారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉల్ రెహ్మాన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చదరంగం అభివృద్ధి చైర్మన్ కనకయ్య, పాఠశాల కరస్పాండెంట్, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక మహోత్సవం



మహిళా భక్తులు వెలిగించిన దీపాలు

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో కార్తిక మహోత్సవం పూజలు వైభవంగా జరుగుతున్నాయి. కార్తీక మాస ప్రదోషకాల నిత్య దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వెలేటి పవన్ శర్మ ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య విరచిత సౌందర్యలహరి పారాయణం భక్తులకు వివరించారు. దీపోత్సవం పూజాకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపోత్సవ క్రతువును తిలకించారు. శ్రీ సత్యసాయి నాట్య అకాడమీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువు చంద్రశేఖర్, కళాకారులు శ్రేష్ఠ, మనోజ్ఞ, భావన, లహరి పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీకి 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి మండల వైద్యాధికారి వైద్యసేవలు అందించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఖండాల సబ్‌సెంటర్ పరిధిలోని రాజుగూడ గ్రామానికి చెందిన గిరిజన గర్భిణీ రక్తహీనతతో బాధపడుతుంది. సబ్ సెంటర్ పరిధిలోని వైద్య సిబ్బంది చికిత్స కోసం పీహెచ్‌సీకి రావాలని ఎన్నిసార్లు నచ్చజెప్పినా ఆమె రాలేదు. దీంతో మండల వైద్యాధికారి డాక్టర్ సర్ఫరాజ్ 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య చికిత్స అందజేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ మోహినొద్దీన్, ఆరోగ్య కార్యకర్తలు రాథోడ్ చంద్రకళ, పవర్ ప్రేంసింగ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ముగిసిన శత చండీయాగం

భైంసా: భైంసాలోని అయ్యప్ప ఆలయంలో మూడు రోజులపాటు సాగిన శత చండీయాగం ముగిసింది. చివరిరోజైన బుధవారం ఆలయ ప్రాంగణంలో హోమం, పూజలు, మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ఏడో వార్షికోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించినట్లు ఆలయ గురుస్వామి మంత్రి సాయినాథ్ తెలిపారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

సరుకులు పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీకి చెందిన సూర రాకేశ్ కుటుంబానికి ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు చేయూతనిచ్చారు. రాకేశ్ గతేడాది గణేశుడి నిమజ్జన ఉత్సవాల్లో విద్యుత్‌షాక్‌కు గురై కాలును పాదం వరకు కోల్పోయాడు. బుధవారం ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు సమకూర్చిన మూడు నెలలకు సరిపడ సరుకులను ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు రాకేశ్‌కు అందించారు. కృత్రిమ కాలు ఏర్పాటు చేయించేందుకు కృష్ణంరాజు హామీ ఇచ్చారని సభ్యులు పేర్కొన్నారు.

వైద్యశిబిరం

కడెం: కడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని మారుమూల ప్రాంతమైన అల్లంపల్లిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి.. బీపీ షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని జీయర్ గురుకుల పాఠశాలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. ఇందులో హెచ్‌ఈవో టి.వేణుగోపాల్, సిబ్బంది బ్లెస్సీ, శశికళ, కొమురయ్యలున్నారు.

ఘనంగా గణపతి హోమం

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో ఉన్న శ్రీ శివపంచాయతన శివమార్కండేయ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణపతి హోమం నిర్వహించారు. అర్చకులు విష్ణుంభొట్ల రాజశేఖరశర్మ బృందం ఆధ్వర్యంలో చతుర్వేద పారాయణం, నవగ్రహ హోమం, సామూహిక కుంకుమార్చన, విగ్రహాలకు మహాస్నపనం, పత్రి పుష్పాలతో విశేష ధాన్య, ఫలపుష్ప, గంధ భస్మామృత, వస్త్రధాన సుగంధ ద్రవ్యాలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాలబాలికలకు రగ్బీ పోటీలు

నిర్మల్‌టౌన్: రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాకు పేరు తీసుకురావాలని ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14 విభాగంలో బాలబాలికలకు రగ్బీ పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ వన్నెల భూమన్న, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు దేవుల విజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ, భూమేశ్, శ్రీలత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'మాలలకే పదవి ఇవ్వాలి'

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని మాల సామాజిక వర్గానికే కేటాయించాలని మాలల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. కుభీర్‌లోని అంబేడ్కర్ భవనంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో 42 గ్రామపంచాయతీలకు గాను 23 గ్రామపంచాయతీలలో మాలల జనాభా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. నాయకులు చాంద్‌రాం, సందీప్, భీమ్‌రావ్, రాహుల్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

ఖానాపూర్: ఈనెల 12 నుంచి నిర్వహించే పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్‌కు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందజేశారు. బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులు ఆయనను కలిశారు. అడ్డగట్ల రాజన్న, లింగాల రాములు, లక్ష్మణ్, సుధాకర్, రాం భీమన్న, తదితరులు ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ

నర్సాపూర్(జి): విద్యార్థినులు సమయం వృథా చేయకుండా ప్రణాళికతో చదివి పదోతరగతిలో అధిక మార్కులు సాధించాలని ఎంఈఓ కిషన్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం, వంటసామగ్రి, కూరగాయలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఓ వీణ, సీఆర్పీ వెంకట్‌రావు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి

సోన్: యువత మత్తు పదార్థాలకు దూరం ఉంటూ సన్మార్గంలో నడవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు నా ర్లాపురం రవీందర్ అన్నారు. బుధవారం సో న్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల నిర్మూలన, జీవన నైపుణ్యాలపై ఏర్పాటు చేసిన అవగాహనలో ఎంఈఓ పరమేశ్వర్, సీఐ నవీన్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థి దశ కీలకమని.. పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. అనంతరం మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై పోస్టర్ ఆవిష్కరించారు. హెచ్‌ఎం ఆరాధన, ఎస్సై గోపి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

• ఎమ్మెల్యే రామారావ్ పటేల్


భైంసారూరల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసే సమయంలో రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని కోతల్‌గాంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని.. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, నాయకులు రాంచంద్రారెడ్డి, రజాక్, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమంపై దృష్టి సారించాలి

భైంసాటౌన్: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను విడుదల చేయగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులో 27.50 లక్షల చేపపిల్లలు పంపిణీ చేయగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సగం మాత్రమే పంపిణీ చేసిందన్నారు. మిగిలిన చేపపిల్లలను సైతం అందించాలని కోరారు. మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 364 చెరువుల్లో 3.25 కోట్ల చేపపిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ సైతం హాజరై ప్రాజెక్టులో చేపపిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గౌతం పింగ్లే, పోశెట్టి, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సోలంకే భీంరావు, రమేశ్, పండిత్‌రావు పటేల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగురాం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, మత్స్యకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం

కుభీర్: మండలకేంద్రంలోని మార్కెట్‌లో బుధవారం సీసీఐ పత్తి కొనుగోళ్లను ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటులో తక్కువ ధరకు పంటను అమ్ముకొని నష్టపోవద్దని రైతులకు సూచించారు. పత్తి ధర క్వింటాల్‌కు రూ.7521 అందిస్తామని.. తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. సీపీవో వెంకటేశ్వర్లు, మార్కెట్ కార్యదర్శి గంగాధర్, బీజేపీ నాయకులు బోయిడి విఠల్, వి.మోహన్, ఏశాల దత్తాత్రి తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ఇంటింటి సర్వే

• తొలిరోజు ఇళ్లకు స్టిక్కర్లు అతికించిన ఎన్యూమరేటర్లు
• 9వ తేదీ నుంచి వివరాలు సేకరణ
• ప్రజలు సహకరించాలని అధికారుల సూచన


నిర్మల్‌లో సర్వే నిర్వహిస్తున్న కమిషనర్


లక్ష్మణచాందలో పరిశీలిస్తున్న ఎంపీడీవో రాధ


లోకేశ్వరం : గడ్‌చాందలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరమేశ్, సిబ్బంది

తానూరు: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇళ్లకు వచ్చి వివరాలు సేకరించే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఇళ్లకు స్టిక్కర్లు అతికిస్తారని.. ఈనెల 9నుంచి ఇంటింటికి వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని.. కుటుంబసభ్యులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం మండలంలోని నగర్, గడ్‌చాందలో ఇళ్లకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియను ఎంపీడీవో వెంకటరమేశ్ పరిశీలించారు. అనుమానులుంటే ఏఎస్‌వోను అడిగి తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. సురేశ్‌గౌడ్ తదితరులున్నారు.

నిర్మల్‌టౌన్: కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఖామర్ అహ్మద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్, శాస్త్రినగర్ కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. పట్టణంలోని ఒక్క ఇంటిని వదలకుండా సర్వే చేపట్టాలని పేర్కొన్నారు. పలువురు సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్: సమగ్ర సర్వే కోసం ఇళ్లకు వచ్చే అధికారులు, సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలో ఉన్న రాజీవ్‌నగర్‌లో నోడల్ అధికారి పరుశురాంనాయక్, కమిషనర్ మనోహర్, సిబ్బందితో కలిసి సర్వేలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, కాలనీవాసులు ఉన్నారు.

భైంసారూరల్: కుటుంబ సర్వే వివరాలను తప్పులులేకుండా నమోదుచేయాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. అన్ని గ్రామాల్లో ఎన్యూమరేటర్లు సర్వే ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు.

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాలకు 75మందిని ఎన్యూమరేటర్లుగా కేటాయించామని.. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని ఎంపీడీవో రాధ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇళ్లకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. ఈనెల 9నుంచి సర్వే ప్రారంభిస్తారని.. ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

నర్సాపూర్(జి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని ఎన్యుమరేటర్లు రాథోడ్ కైలాస్, హేమలత కోరారు. మండల కేంద్రంలో సర్వే వివరాలు నమోదు చేసుకున్నారు.

సారంగపూర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. ఈసందర్భంగా గ్రామాలకు చేరుకున్న సర్వే బృందాలు కుటుంబాల వివరాలను సేకరించారు.

సోన్: మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో బుధవారం 2,409 కుటుంబాల ఇళ్లకు స్టిక్కర్లు అంటించినట్లు ఎంపీఓ ఖలీల హైమద్ తెలిపారు. కడ్తాల్ గ్రామంలో జెడ్పీ సీఈవో, సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. సర్వేలో 69 మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటారని.. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యదర్శులు సుమయ్యద్ తస్కీన్, రాణి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సారంగపూర్ : మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

నిర్మల్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమస్య వస్తే డయల్ 100 కు కాల్ చేయాలని పేర్కొన్నారు. అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈమెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింకు ను క్లిక్ చేస్తే మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. సైబర్ మోసాల బారిన పడితే వెంటనే నంబర్ 1930కు కాల్ చేయాలని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, పోక్సో చట్టాలు, సీసీ కెమెరాల ఏర్పాటుతో లాభాలపై అవగాహన కల్పించారు. అనిల్, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గంజాయి,డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. ఎస్సై సీహెచ్.భాస్కరాచారి, ఏఎస్సైలు రాందాస్, జీవన్‌రావు, ప్రిన్సిపాళ్లు గట్టుపల్లి శ్రీనివాస్, బోయ సాయిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగపూర్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. మండలంలోని మలక్‌చించోలిలో బుధవారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హన్మాండ్లు సూచించారు. నర్సాపూర్(జి)లోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. ఈమెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే మీ మొబైల్‌లోని డేటా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు కాల్ చేయాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగంతో నష్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, సీసీ కెమెరాలు ప్రాముఖ్యత, కొత్త చట్టాలు వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కన్వెన్షన్ హాల్ ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో నిర్మించిన నిర్మల్ మున్నూరుకాపు మిత్ర మండలి కన్వెన్షన్ హాల్‌ను బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సోన్: దొంగతనాల నియంత్రణకు ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సోన్ సీఐ నవీన్ కుమార్ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్ బొప్పారంలో బుధవారం ఎస్సై గోపితో కలిసి ఆలయాలను పరిశీలించారు. వీడీసీ చైర్మన్ రొడ్డ రాజేశ్వర్, గజ్జల గంగాధర్, వీడీసీ సభ్యులు చిన్నయ్య, రమేశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసులు పంపిణీ

సారంగపూర్: మండలంలోని బోరిగాంలో గ్రామానికే చెందిన 31 మంది దివ్యాంగులకు బుధవారం డీఎం ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. 50శాతం రాయితీ తో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, డీలక్స్ బస్సుల్లో ప్ర యాణించవచ్చని విలేజ్ బస్ అధికారి రమణారెడ్డి తెలిపారు.

గ్రామసభ

నర్సాపూర్(జి): మండలంలోని బామ్ని (బి)లో బుధవారం ఉపాధిహామీ రెండో గ్రామసభ నిర్వహించారు.. 2025–26లో పనుల గుర్తింపు, కూలీల బడ్జెట్ అంచనాలను తయారు చేసినట్లు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, కార్యదర్శి గంగాజల ,ఫీల్డ్ అసిస్టెంట్ భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తహసీల్దార్ సోమ శ్రీనివాస్ పంపిణీ చేశారు. ముధోల్ నియోజకవర్గపరిధిలోని బూరుగుపల్లి(జి), మొతక్‌పల్లి, గొల్లమాడ, చాక్‌పల్లి, నందన్, తురాటి గ్రామాలకు చెందిన ఎనిమిది మందికి కల్యాణలక్ష్మి, ఒకరికి షాదీముబారక్ చెక్కులు అందజేశారు. డీటీ వాహిదొద్దీన్, ఆర్ఐ వేణుగోపాల్, మాజీ సర్పంచ్‌లు చెన్న మహేశ్, సురేశ్, వినోద్‌రెడ్డి, అడ్డిగ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్‌టౌన్: స్వీట్ హోమ్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బుధవారం నిర్వాహకుడు నారాయణ పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అసత్యాలు ప్ర చారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


గృహిణిని అభినందించిన ఎంపీడీవో

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే పరిశీలనకు వెళ్లిన ఎంపీడీవో రాధను వివిధ రకాల మొక్కలున్న ఓ ఇల్లు ఆకట్టుకుంది. వెంటనే ఆ ఇంటి గృహిణి ఓస లలితను పిలిపించి.. పూల మొక్క అందించారు. మొక్కలు పెంచుతున్నందుకు అభినందించారు. ఇందులో ఎంపీవో అమీర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

భైంసాటౌన్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.7800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద మహాధర్నా చేపట్టారు. ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్ , శివకుమార్, దినేశ్, సాయి, గంగప్రసాద్, ఆకాశ్, శశాంక్, బాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

షిర్డీ వరకు పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్: దత్త జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గండి రా మన్న సాయిబాబా ఆలయం నుంచి పలువురు భక్తులు షిర్డీ వరకు పాదయాత్రగా బయలుదేరారు. బుధవారం ప్రారంభమైన ఈ పాదయాత్ర సుమారు 20 రోజులు సాగనుంది. అంతకుముందు ఆలయంలో సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో సాయిభక్తులు పూదరి నరహరి, నారాయణరెడ్డి, రాజేశ్, హరి చౌదరి, మూర్తి మాస్టర్, దేవేందర్‌రెడ్డి, రేణుకదాస్, జొన్నల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే సమగ్ర కుటుంబ సర్వే

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని సత్తనపల్లిలో కుటుంబ సర్వేను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సర్వేపై భిన్నాభిప్రాయాలుంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. అనంతరం గ్రామంలోని ధనిశెట్టి భూమన్న ఇంటి వద్ద అధికారులు, సిబ్బందితో కలిసి స్టిక్కరింగ్ అంటించే ప్రక్రియను ప్రారంభించారు. అంతకుముందు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సుర్జాపూర్, బాదనకుర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్నం సత్యం, దయానంద్, శ్రీనివాస్‌రెడ్డి, కావలి సంతోష్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, గంగనర్సయ్య, తోట సత్యం, జంగిలి శంకర్, గుమ్ముల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుసుంపూర్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ఖానాపూర్: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని మండలంలోని కొలాంగూడ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్ గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. బీర్నంది నుంచి కుసుంపూర్‌కు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆత్రం మోతీరాం, తొడసం శంభు, ఆత్రం అర్జున్, సైతం తిరుపతి, కురుక రాము, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాస్‌బాబు

నిర్మల్‌చైన్‌గేట్: భూగర్భజలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని భూగర్భజలశాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్‌బాబు అన్నారు. బుధవారం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల పాఠశాలలో భూగర్భజలాల ప్రాముఖ్యతపై అవల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భూగర్భ జలాల సంరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం భూగర్భజలాల సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డానియల్, హైడ్రాలజిస్టులు సుహాసిని, చంద్రశేఖర్, వ్యవసాయాధికారులు వినోద్, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటిలో మునిగి రెండు ఆవులు మృతి


మృతి చెందిన ఆవుల కళేబరాలు

లోకేశ్వరం: ప్రమాదవశాత్తు నీట మునిగి రెండు ఆవులు మృతి చెందిన ఘటన మండలంలోని నగర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు, గ్రామస్తుల కథనం ప్రకారం.. నగర్‌కు చెందిన సర్కెల చిన్న గంగన్న అనే రైతు మధ్యాహ్నం తన వ్యవసాయ క్షేత్రం నుంచి తనకున్న రెండు ఎద్దులు, నాలుగు ఆవులను పక్కనున్న ఎలమ్మకుంటలో నీరు తాగించేందుకు తోలుకెళ్లాడు. రెండు ఎద్దులు, రెండు ఆవులు నీరు తాగి బయటకు రాగా.. మిగతా రెండు ఆవులు పొక్లెయిన్ తవ్విన గుంతలో పడి మరణించాయి. వాటి విలువ రూ.90 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి


యజమానులతో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: హోటళ్లలో తయారు చేసే ఆహార పదార్థాల్లో పరిశుభ్రత, నాణ్యత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని హోటళ్లు ,రెస్టారెంట్ల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హోటళ్లలో నిషేధించబడిన పదార్థాలు, ఫుడ్ కలర్స్‌ని వినియోగించొద్దని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో పట్టణంలోని హోటళ్ల యజమానులు ఉన్నారు.

అన్ని పత్రాలు కలిగి ఉండాలి

• ఖానాపూర్ సీఐ సైదారావు


మాట్లాడుతున్న సీఐ సైదారావు

కడెం: వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కల్గి ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలో కార్డన్‌సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 51 బైక్‌లు, రెండు కార్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేని ఐదు బైక్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పరిసరాల్లో అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందులో కడెం, దస్తురాబాద్, ఖానాపూర్ మండలాల ఎస్సైలు కృష్ణసాగర్‌రెడ్డి, శంకర్, రాహుల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తూకం వేయడంలో జాప్యం చేయొద్దు


ఖానాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న డీసీవో పాపయ్య

ఖానాపూర్: కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన పంటలో తేమశాతం వస్తే వెంటనే తూకం వేయాలని నిర్మల్ డీసీవో పాపయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లే అందించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజమల్లు, సీఈవో భూమి ఆశన్న తదితరులున్నారు.

జామ్‌లో కేంద్రం ప్రారంభం..

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మంతెన గంగారెడ్డి, విలాస్, తిరుమలచారి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, వీడీసీ సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899